


# అప్పు



విశ్వేశ్వరయ్య కొడుకు మాట్లాడుతున్నదివిని హతాశుడయినాడు. కుర్చీలో నిటారుగా అయిపోయి, "అయితే నే చేసింది తప్పేనంటావు. అంతేనా?" కొడుకు రాజశేఖర్‌ను ఉద్దేశించి అన్నాడు.

"అదే కదా అప్పట్నుండీ ఏడ్చేది. తలకు మించిన అప్పులు చేయడం, తలకు మునిగి తలెత్తుకోలేకపోవడం. ఏమిటిది? ఉన్నదాంట్లో ఏదో తిని బ్రతకలేకపోయే వాళ్ళమా?" రాజశేఖర్ అసహనం ప్రబలమయింది.

"ఎవరి కొరకురా చేసింది? మీరు సుఖపడుతూ మమ్మల్ని వుద్ధరిస్తారని కాదా!" ఆవేదనగా అన్నాడు విశ్వేశ్వరయ్య.

"కన్నందుకు చేయాల్సింది చేశారు. ఇప్పుడు పీకల మీద కొచ్చి పడ్డారు." కోపం పెరిగి వివేచన నశించింది రాజశేఖర్‌కు. "ఎవరి సంసారం వాళ్ళను గడుపుకోనివ్వాలన్న ఇంగితం లేదు కదా?" ఆ ఇంగితం లోపించింది రాజశేఖర్ ఆలోచనలో. భార్య వాసంతి చెప్పిన మాటలు అమోఘంగా పనిచేస్తున్నాయి. అతని బాధల్లా తండ్రి వచ్చి తనతో వుంటానన్నందు వల్లనే. 'ఊర్లో అప్పులు చేసి ఇక్కడికొస్తే తను అదెక్కడ మోయగలడు?' "ఆ జ్ఞానం వుంటే మిమ్మల్ని ఈ మాత్రం చదివించి వుండకపోదును. ఏదో మిడిమిడి జ్ఞానం కదరా! అందుకని అలా చేశాను!!" విశ్వేశ్వరయ్య ఆత్మాభిమానం దెబ్బతిని ఒక్క విసురున లేచి కండువా అందుకున్నాడు. "నెలనెలా వచ్చే పెన్షన్ డబ్బు జాగ్రత్తగా వాడుకోండి. అప్పుడప్పుడూ వీలయితే వస్తూండండి" ఏదో మాటలు కోశాడు రాజశేఖర్. విశ్వేశ్వరయ్య అసహ్యంతో గబగబా బయటకు నడిచాడు. రాజశేఖర్ కొంత రిలీఫ్ ఫీలవుతూ కాసేపు ఇంట్లోనే కూర్చొని ఆలోచనల రొద భరించలేక రోడ్డు మీద పడ్డాడు. చివరగా ఓ బార్‌లో సెటిలయిన అతని మెదడు నిండా తండ్రి గూర్చే ఆలోచనలు. 'ఏదో సంపాదించుకుని సుఖంగా వుంటున్నామని చూసిపోక, అప్పుల గొడవ తెచ్చాడీయన. ఎవరు చేయమన్నారు? ఎవరు తీర్చాలివి?' గొంతులోకి జారుతున్న నిషా ద్రవంతో మెదడులోని విషం పోటీపడుతోంది. నిజానికి వాసంతి అనబట్టే తెలిసొచ్చింది ఈయన నైజం. వాసంతి వస్తూ కట్నంగా పెద్ద డబ్బేమీ తేలేదు. కనుక డబ్బు పొదుపు చేయాలి. క్రమంగా రాజశేఖర్ ఆలోచనాస్రవంతి తండ్రిని దాటివెళ్ళి తన భవిష్యత్తుపై స్థిరపడింది. 'ఏదో జీతం వస్తుంది. ఇంటి ఖర్చులకు, పిల్లవాళ్ళ చదువులకు, సామాన్లకు (టి.వి. వగైరా) సరిపోతుంది. ఇప్పుడు ఈయన చేసిన అప్పులు తీర్చడం, ఈయన్ను పోషించడం పెద్ద అనవసరపు రగడ. పెన్షన్ వస్తుంది కదా-తను చూసుకుంటాడ్లే!' పరిపరి విధాల ఆలోచిస్తూ బిల్లు చెల్లించి ఇంటి దారి పట్టాడు రాజశేఖర్ నిషాతో తూలుతున్న అడుగులతో.

*　*　*

అనుభవాలు తలను బాదగా ఏర్పడ్డ బట్టతలను రుద్దుకుంటూ పడక్కుర్చీలో కూర్చున్నాడు రాజశేఖరం. రిటైరయి మూడు సంవత్సరాలయింది. పడక్కుర్చీలో కూర్చున్నాడూ అంటే విశ్రాంతి కన్న మాట. బట్టతల రుద్దుతున్నాడూ అంటే తీవ్రమైన ఆలోచనలు మెదడుపై దాడి చేశాయన్నమాట. ఎదురుగా పెద్దబ్బాయి కూర్చున్నాడు. చదువు పూర్తయి నాలుగు సంవత్సరాలయినా ఉద్యోగం రాలేదు. ఇపుడేదో అవకాశం వచ్చిందట. దానికి కొంత డబ్బు అవసరమట. తనకు

జీవితంలో అతి పెద్ద తప్పు అప్పు చేయడం! నిజమే! అయితే తప్పనిసరి పరిస్థితులలో తప్పే ఒప్పు కాక తప్పదని వివరించే ఆధునిక రుణ వేదం.



వచ్చే. పెన్షన్ డబ్బు సక్రమంగా రావట్లేదు. ఏం చేయాలో తోచక పోయినా చివరకు గొంతు పెకల్చుకొని "సరేరా, ఓ రెండు రోజులు ఓపిక పట్టు చూద్దాం" అన్నాడు. పెద్దబ్బాయి లేచి వెళ్ళిపోయాడు. చిన్నవాడు మాటిమాటికీ అక్కడే తచ్చాడుతుంటే గుర్తుకొచ్చింది, వాడు.కాలేజీలో చేరడానికి డబ్బు అడిగాడని. ఒక్కసారిగా నీరసమావహించింది. డబ్బేమైనా వుందా అంటే పిల్ల పెళ్ళికీ, వీళ్ళ చదువులకూ అది కాస్తా హరించుకుపోయింది. ఆస్తేమైనా అమ్మి సర్దుదామంటే ఆస్తంటూ వుంటే కదా! ఆలోచిస్తున్న కొద్దీ రాజశేఖరం ఇంకా నీరసపడిపోసాగాడు. ఈ అవకాశం తప్పితే ప్రయత్నానికి నీళ్ళు వదలాలంటాడు పెద్దబ్బాయి. ఎలాగైనా కాలేజీలో చేరాలంటాడు చిన్నవాడు. మిత్రుడు దయాకరం ఏదైనా సలహా ఇస్తాడేమోనని కండువా భుజాన వేసుకుని. బయటకు నడిచాడు రాజశేఖరం. దయాకరం డబ్బులేనివారికి 'దయ'తో సహకరిస్తుంటాడు. దయాకరం తన ఫక్కీలో చెప్పినది విని బెంబేలెత్తినా తప్పదు కనుక నూటికి ఆరు చొప్పున వడ్డీతో డబ్బు తీసుకొని నీరసంగా ఇల్లు చేరాడు రాజశేఖరం. ఎవరికి కావాల్సింది వాళ్ళకు ఇచ్చేసి ఖాళీ చేతులు దులుపుకున్నాడు రాజశేఖరం. మూలకు బూజు పట్టిన తండ్రి ఫోటో కనిపించింది. దులుపుదామని తీసి చూసేసరికి అప్పు విషయంలో తండ్రితో పరుషంగా మాట్లాడిన సందర్భం గుర్తుకొచ్చింది రాజశేఖరానికి. వెన్ను జలదరించింది ఒక్కసారిగా. 'తనెంత దుస్థితిలో తల్లిదండ్రులను వదిలేశాడు! రేపు తన కొడుకులలా చేస్తే?' తండ్రి ఫోటో చేతిలో వుంచుకుని అలాగే నిల్చుండిపోయాడు అప్పు చేసిన రాజశేఖరం—

—మధుసూదన్

బ్రావా

# నిరంతరం నేర్చుకోవాలి

"నేర్చుకోవాలి, నేర్చుకోవాలి" అని "మార్క్స్" తరచు గట్టిగా చెబుతుండేవాడని నలభై ఏళ్ల అనంతరం స్నేహితుడైన "లీబ్‌క్నేట్" గుర్తు చేసుకున్నాడు. "ఆయన సాహచర్యంలో అప్పటికే మాకా లక్షణం వంటపట్టింది. ఆచరణలో అదెంతగానో ఉపయోగడింది" అని రాసాడు. మార్క్స్ లండన్‌లో "బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీ"లో చదివేటప్పుడు పరిచయమైన అతి ముఖ్యమైన స్నేహితులలో లీబ్‌క్నేట్ ఒక్కడు. ఇక్కడ మార్క్స్ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటలవరకూ పుస్తకాలలో మునిగే వాడు. ఇందులో చరిత్ర, రాజకీయ శాస్త్రం, జీవ శాస్త్రం, సాంకేతిక శాస్త్రం, దౌత్యనీతి తదితర విజ్ఞాన శాస్త్రాలెన్నిటినో మార్క్స్ అధ్యయనం చేశాడు.

"మార్క్స్ పద్ధ్రశమ ఎనలేనిది. ముఖ్యంగా ప్రవాసపు తొలి దినాలలో కలిగిన ఆటంకాలను బట్టి ఆయన పగటికన్నా రాత్రిపూట పనిచేయడమే మెరుగు అన్న అభిప్రాయానికి వచ్చాడు. దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక సమావేశంలో ఆయన పాల్గొనవలసి వచ్చేది. రాత్రి బాగా ప్రొద్దు పోయిన తర్వాత ఇంటికి చేరే మార్క్స్, ఆ తర్వాత అనేక గంటల పాటు అలా రాస్తూనే కూర్చొనేవాడు. ఆ గంటలు అలా అలా పెరిగిపోయి, చివరకు ఆయన మొత్తం రాత్రంతా పనిచేసి, పగలు నిద్రపోయేవాడు. భార్య ఇది మంచిదికాదని నివారిస్తే సహజధోరణిలో మందహాసం చేసేవాడు" అని లీబ్‌క్నేట్ రాశాడు. 'క్యాపిటల్' మార్క్స్ నలభై ఏళ్ల పరిశ్రమ ఫలితం. అంతగా పనిచెయ్యడం ఆయనకే చెల్లింది అంటాడాయన.




అంతటి మహనీయుడు క్యాపిటల్ గ్రంథంకోసం కృషి చేస్తున్న తరుణంలో 1865 జులైలో మిత్రుడైన ఫ్రెడరిక్ ఎంగెల్స్‌కి ఉత్తరంలో ఇలా వ్రాశాడు. "నేను పూర్తిగా తాకట్టుకొట్టుపై ఆధార పడి బ్రతుకుతున్నాను. నా దగ్గర గనక కుటుంబ పోషణకు తగినంత డబ్బువుంటే, నా పుస్తకం పూర్తయితే నేడో రేపో స్మశానంలోకి వెళ్లేందుకు వెనుకాడను. అయితే అదే సాధ్యమవడంలేదు" అని వ్రాశాడు. చివరకు ఒక రైల్వే కంపెనీలో ఉద్యోగానికై మార్క్స్ దరఖాస్తు పంపాడు. అయితే అక్షరాలు గుండ్రంగా లేనికారణంగా ఆయనకా ఉద్యోగం రాలేదు. అయితే ఇటువంటి మహామేధావియైన మార్క్స్‌ని కుప్పకూలిపోకుండా కాపాడి, ఆయన కృషిని కొనసాగించేలా చేసింది నిస్వార్థమైన నిరంతర సహాయం చేసిన మిత్రుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్.

సేకరణ : తెలకపల్లి రవి

తెలుగు అనువాదం: 'మార్క్స్ జీవిత కథ' నుంచి.

—యర్రంశెట్టి హరిహరకుమార్

## అనకూడదు

మన రోజువారీ పనులలో 'అలాగే మళ్ళీ కలుద్దాం' అనీ, 'అలాగే తప్పకుండా చేద్దాం' అనీ, 'వస్తా' అనీ అంటుంటాము.

అయితే కొన్నిచోట్ల అలా అనకూడదని పెద్దలు అంటుంటారు. ముఖ్యంగా ఆస్పత్రి నుంచి, శ్మశానం నుంచి, పరామర్శ చేశాక తిరిగి వెళ్ళేటప్పుడు 'మళ్ళీ వస్తాం' అనీ, 'మళ్ళీ కలుద్దాం' అనీ అన్నాం అనుకోండి. ఎలా వుంటుంది? తలుచుకుంటేనే వెన్ను జలదరించదూ?



## ఆకాశం-అమ్మ



ఆకాశంలో అందాలు
అమ్మలో కన్పించాయి!!
ఆకాశంలో నీలి మబ్బులు
అమ్మ మొహంలో కోపం నీడల్లా!!
ఆకాశంలో ఉరుములు
అమ్మ మాటల్లా బిగ్గరగా!!
ఆకాశంలో మెరుపులు
అమ్మ చూపుల్లా వాడిగా!!
ఆకాశం కురిసే వాన చినుకులు
అమ్మ పలికే తీయని మాటల్లా!!
ఆకాశంలో వెన్నెల
అమ్మ నవ్వులో చల్లదనంలా!!

—కె. శ్రీ అంజన